జూన్ నుంచి అంగన్‌వాడీ బడిబాట

కార్మికనగర్-1 అంగన్‌వాడీ స్కూల్‌లో చిన్నారులకు స్టార్ గుర్తింపు కార్డులు ఇస్తున్న టీచర్లు (ఫైల్)

జూబ్లీహిల్స్, మే 15: పేద పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. పోషకాహారమే ప్రధానంగా కాకుండా పోటీ ప్రపంచంలో ఒనమాలు నేర్పిస్తున్నాయి. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బస్తీల్లో పిల్లలకు, తల్లులకు 365 రోజులు బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్న అధికారులు.. వేసవిలో పిల్లలకు వేడుకగా ప్రోగ్రెస్ కార్డులతో పాటు స్టార్ గుర్తింపు కార్డులు ఇస్తున్నారు. ప్లేస్కూల్ విద్యతో శ్రీకారం చుట్టి వేసవి సెలవుల్లో సైతం కొనసాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రైవేట్ ప్లేస్కూల్‌లకు దీటుగా అక్షరాభ్యాసం అందిస్తున్నారు. ఐదో ఈడుకు వచ్చిన పిల్లలకు టీసీ ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు మార్గం సుగమం చేస్తున్నారు. కాగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన చిన్నాల ప్రతిభను ప్రోత్సహించేందుకు విద్యాసంవత్సరం ప్రారంభంలో ఒక స్టార్, అర్ధ సంవత్సరంలో ఒక స్టార్, ఏడాదిలో మరొక స్టార్‌ను అందిస్తూ మూడు స్టార్‌లతో వారిని ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల రహ్మత్‌నగర్ సెక్టార్ కార్మికనగర్-1 అంగన్‌వాడీ స్కూల్‌లో చిన్నారులకు స్టార్ గుర్తింపు కార్డులు, ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. సెక్టార్ సూపర్‌వైజర్ రేవతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీచర్లు ధనలక్ష్మి, అనిత, రజిత, సుమతి, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ పనులకు వెళ్లే తల్లిదండ్రులకు అండ గా ఉండేందుకు తల్లి ఒడి విడిచిన పిల్లలను అంగన్‌వాడీల్లో అక్కున చేర్చుకుంటున్నారు. ఆయా చిన్నారులకు బాలామృతంతో పాటు మూడేండ్లు దాటిన పిల్లలకు పాలు, కోడిగుడ్డు వంటి పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఇందులో భాగంగా జూన్ నుంచి బస్తీల్లో అంగన్‌వాడీ బడిబాట ప్రారంభించనున్నారు. చిన్నారులకు బలమైన పోషకాహారం, నాణ్యమైన విద్య అందించేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, మే 15: గగన్‌పహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశాలిపురం ఫీడర్ పరిధిలో ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల వరకు పీరంచెరువు ఇండస్ట్రీయల్ ఏరియా, తమిళ్ బస్తీ, అహ్మద్‌నగర్, ఆర్ఈసీ ఫీడర్ పరిధిలో ఉదయం 6.30 నుంచి 7 గంటల వరకు తమిళ్‌నాడు హోటల్, డైమండ్ వెయిట్ బ్రిడ్జి, బుద్వేల్ రైల్వే స్టేషన్, పరివార్ దాబా, ఆర్ఈసీ, ఆరాంఘర్, సాతంరాయి ఫీడర్ పరిధిలో 8 నుంచి 8.30 గంటల వరకు పాశంబండి, ఆర్‌జీకే, సుచిత్ర ఇండి యా, పాశంబండ ఏజీఎల్, మంజీగా కండక్టర్, వీఎన్ ఆర్ వెంచర్ ప్రాంతా ల్లో మరమ్మతుల కారణంగా ఈ కోతలు విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

సాయం చేయాలంటూ.. మొబైల్ చోరీ

బంజారాహిల్స్, మే 15: సాయం చేయాలంటూ కోరి మొబైల్ ఫోన్‌ను తస్కరించిన వ్యక్తులపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. లంగర్‌హౌజ్‌లోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఎం.విజయ్‌కుమార్ ఈనెల 11న ఓయూకాలనీలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. భీమాస్ హోటల్‌లో టిఫిన్ చేసి కారు తీసుకునేందుకు వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి అతడి సమీపంలో కిందపడిపోయినట్లు నటించారు. వారిలో ఓ వ్యక్తి రోడ్డుమీద పడి ఉండగా రెండో వ్యక్తి బైక్ లేపడానికి ప్రయత్నిస్తూ సాయం చేయాలంటూ విజయ్‌కుమార్‌ను కోరాడు. దీంతో బైక్‌ను లేపగానే వేగంగా ఇద్దరూ కలిసి ముందుకు దూసుకువెళ్లారు. వారు వెళ్లిన తర్వాత తన జేబులో చూసుకోగా మొబైల్ కనిపించలేదు. సాయం కోరిన వారే మొబైల్ ఫోన్ తస్కరించి ఉంటారని బాధితుడు బుధవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఐపీసీ 420, 379 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శారదధామంలో ఆచార్యులకు శిక్షణ

ఆచార్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న విద్యా భారతి దక్షిణ క్షేత్ర కార్యదర్శి లక్షణరావు

బండ్లగూడ, మే 15: విద్యారంగానికి అంత్యత ప్రధాన్యత ఉన్నదని, విద్యతోనే సమాజం బాగుపడుతుందని విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి అయాచితుల లక్ష్మణరావు పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీశారద ధామంలో నూతన ఆచార్యులకు శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, ఆచార్యులను ఉద్దేశించి మాట్లాడారు. శిశు మందిర్‌లో బోధించే ఆచార్యులు విషయ పరిజ్ఞానంతో పాటు సమగ్ర వికాసం కలిగే విధంగా యోగ, కళాత్మక అంశాలు, వ్యాయామంతో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థికి భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మిణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సరస్వతి విద్యా పీఠం ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ నీలిమ, సరస్వతి విద్యా పీఠం తెలంగాణ అకాడమిక్ ఇన్‌చార్జి కృష్ణమాచార్యులు, నూతన ఆచార్యులు పాల్గొన్నారు.

గుర్తింపులేని కాలేజీల జాబితా ప్రకటించాలి

ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శృతి ఓజాకు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఏఐవైఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్, మే 15: రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ బోర్డ్ అనుమతి లేకుండా కొనసాగుతున్న జూనియర్ కాలేజీల జాబితాను ప్రకటించాలని ఏఐవైఎఫ్ ప్రతినిధి బృందం కోరింది. రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి శృతి ఓజాకు కోరుతూ బుధవారం వినతిపత్రాన్ని ఏఐవైఎఫ్ ప్రతినిధులు అందజేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ.. వేసవి సెలవులు పూర్తికాకుండానే ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు అక్రమంగా అడ్మిషన్లను తీసుకుంటున్నాయని ప్రభుత్వ నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతులు లేని కాలేజీలలో విద్యార్థులు చేరితే తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్, నాయకులు టి.సత్యప్రసాద్, కిరణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధి వనిత వోసుదేవ్

మణికొండ, మే 15: యువతలో సృజనాత్మకత, ఆవిష్కరణలో పోటీతత్వం పెంపొందించడమే లక్ష్యంగా పని చేయాలని ఐఐటీ ఢిల్లీ ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ప్రతినిధి వనిత వోసుదేవ్ అన్నారు. గండిపేట్‌లోని మహాత్మగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన వాతావరణం, సుస్థిరత అంశంపై సమావేశం జరిగింది. సొల్వ్ ఫర్ టుమారో సెన్సిట్రైజేషన్ సెషన్‌లో వనిత మాట్లాడుతూ.. సాంసంగ్ ఇండియా విద్యార్థుల్లోని ఆవిష్కరణల స్ఫూర్తికి వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, సంస్థ ప్రతినిధి అరుణ రాజ్, రంజిత్‌సింగ్, ముస్కాన్, వెంకట్‌రెడ్డి, మాధవి, ప్రవీణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

మైలార్‌దేవ్‌పల్లి, మే 15: అప్రమత్తతతో ప్రమాదాలను నివారించవచ్చని నవ యువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఉడ్డంగడ్డ జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో ఏజెన్సీ రెస్క్యూ టీం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు, భారీ వర్షం, ఈదురు గాలులు వల్ల జరిగే ప్రమాదాల గురించి గ్రౌండ్‌లో అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, పరిష్కార మార్గాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి ప్రమాదాలు జరిగిన సమయంలో అప్రమత్తంగా ఆలోచించి నివారణకు చర్యలు తీసుకోవడం ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ఏజెన్సీ సిబ్బంది

మాస్క్ ధరించి.. వాచ్‌మన్ ఇంట్లో చోరీ

బంజారాహిల్స్, మే 15: అర్ధరాత్రి వేళ మాస్కు ధరించిన వ్యక్తి ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ గదిలో చోరీ చేశాడు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు.. నవోదయకాలనీలోని విశాల్ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో వీరయ్యనాయుడు వాచ్‌మెన్. మంగళవారం అర్ధరాత్రి గది బయట వీరయ్య, లోపల అతడి కొడుకు పడుకొన్నారు. కాసేపటికి అలికిడి కావడంతో నిద్రనుంచి వీరయ్య మేల్కొని పట్టుకునేందుకు యత్నించగా పారిపోయాడు. ఒంటిపై బ్లాక్ కలర్ డ్రెస్‌తో పాటు ముఖానికి మాస్క్ ధరించిన ఆగంతకుడు సుమారు 35వేల నగదు, సెల్‌ఫోన్ తస్కరించాడని వీరయ్యనాయుడు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

యువత ఆర్థికంగా అభివృద్ధి చెందాలి: ఎమ్మెల్యే

యువత స్వయం ఉపాధి రంగంలో రాణించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్‌లో స్థానిక యువకుడు ఏర్పాటు చేసిన ఆటో మోబైల్ షాపును బుధవారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు రఘుయాదవ్, శ్రీనుగౌడ్, లక్ష్మారెడ్డి, శరణమ్మ, పుష్ప పాల్గొన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి

స్విమ్మర్ విక్టోరియాకు డాక్టరేట్

కాచిగూడ, మే 15: బర్మత్‌పురకు చెందిన స్విమ్మర్ గంధం క్వీన్ విక్టోరియాకు డాక్టరేట్ లభించింది. డేస్ స్ప్రింగ్ క్రిస్టియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఫిన్ స్విమ్మర్‌లో ప్రతిభ కనబర్చిన ఆమెకు సువార్త శాంతి ప్రార్థన సంస్థ చైర్మన్ డాక్టర్ ప్రభుచరణ్ ముఖ్యఅతిథిగా హాజరై డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ రాజాజీ ప్రసాద్, సునీత పాల్గొన్నారు.

అలరించిన.. సినీ సంగీత విభావరి

ముషీరాబాద్, మే 15: కళానిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. కె.బాపిరాజు ఆధ్వర్యంలో గాయకులు రేవతి, శ్రీమణి, శివరామకృష్ణ, అరుణ్, రుక్మిణి, సీతారామారావు, రాధాకృష్ణ, సీతారత్నం, సుబ్బిరెడ్డి, వెంకటేశ్వర్ అలపించిన మధుర గీతాలు రంజింప చేశాయి. పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ విచ్చేసి సామాజిక, ఆధ్యాత్మికవేత్త చిక్కా దేవదాసుకు సహస్ర సేవాధురీణ బిరుదు ప్రదానం చేశారు.

80లో ఓటేసి స్ఫూర్తి నింపారు..

● ఓటింగ్ శాతం పెంచడంలో కీలక భూమిక పోషించిన వయోవృద్ధులు

జూబ్లీహిల్స్, మే 15: లోక్‌సభ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు ఉత్సాహం కనబరిచారు. నడవలేక ఒకరి సహాయాన్ని ఆశించే వారు ఓటింగ్ శాతం పెంచడంలో తమవంతు పాత్ర పోషించారు. అయితే అన్నీ బాగుండి ఓటు వేయకుండా ఇంట్లో కూర్చున్న వారికంటే వృద్ధులే బెట్టర్ అని పలువురు పేర్కొంటున్నారు. ఈనెల 13న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వృద్ధులు ఓటేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. సీనియర్ సిటిజన్స్‌ను, పీడబ్ల్యూడీ ఓటర్లను పోలింగ్ స్టేషన్లకు తరలించేందుకు ఎలక్షన్ అధికారులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. 85 ఏండ్లు పైబడిన సీనియర్ సిటిజన్స్‌తో పాటు దివ్యాంగ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌తో పాటు పోలింగ్ బూత్‌కూ తరలివచ్చి ఓటేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 2187 మంది సీనియర్ సిటిజన్స్, 1818 మంది దివ్యాంగులైన పీడబ్ల్యూడీ ఓటర్లున్నారు. వారిలో 90 మందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటివద్దే ఓటు వేయించిన అధికారులు మిగతా వారిని పోలింగ్ స్టేషన్లకు తరలించేందుకు కృషి చేశారు. జూబ్లీహిల్స్ నోడల్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు ఆధ్వర్యంలో యూసీడీ సిబ్బంది నియోజకవర్గంలోని ఆయా డివిజన్ల నుంచి పోలింగ్ స్టేషన్లకు రాలేని వారిని యుద్ధప్రాతిపదికన ఓటు

యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో వీల్ చైర్‌లో పోలింగ్ కేంద్రానికి వస్తున్న వృద్ధురాలు (ఫైల్)

వాహనంలో వృద్ధురాలిని పోలింగ్ బూత్‌కు తరలిస్తున్న యూసీడీ సిబ్బంది (ఫైల్)

వేసేందుకు తరలించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో 39.80 శాతం నమోదైన పోలింగ్ ఈ ఎన్నికల్లో 45.79 శాతానికి పెంచడంలో ఆయా వర్గాల ఓటర్లు కీలక భూమిక పోషించారు. ఈ సందర్భంగా వారిని అభినందించక ఉండలేం.

ప్రతిభగల విద్యార్థులకే అవకాశాలు

ఫ్యాషన్ షో, ర్యాంప్ వాక్‌లో పాల్గొన్న విద్యార్థినులు

హిమాయత్‌నగర్, మే 15: ప్రతిభ గల విద్యార్థులకు అవకాశాలు వెన్నంటే ఉంటాయని, పుస్తకాల పరిజ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జాహ్నవి విద్యా సంస్థల చైర్మన్ ఎ.పరమేశ్వర్, వైస్ చైర్మన్ ఎ.లక్ష్మి సూచించారు. సికింద్రాబాద్, ప్యారడైజ్ జాహ్నవి జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజీల వార్షిక వేడుకలు బుధవారం నారాయణగూడలోని షాలిమార్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగాయి. వారు మాట్లాడుతూ.. విద్య పదునైన వజ్రాయుధమని, పోటీ ప్రపంచంలో రాణించేందుకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కృషి, పట్టుదలతో చదివితే జీవితంలో ఉన్నత లక్ష్యాలు సులభతరమవుతాయని ఆ దిశగా విద్యార్థులు ప్రయత్నించాలని సూచించారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచనలకు పదునుపెట్టి ఎంచుకున్న రంగంలో ప్రతిభ చాటాలని సూచించారు. విద్యార్థులు ఫ్యాషన్‌షో, ర్యాంప్‌పై క్యాట్ వాక్ చేస్తూ హోయలొలికించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కళాశాలల్లో నిర్వహించిన వివిధ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్‌గా ముజఫర్ అలీ



ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్‌గా ముజఫర్ అలీ నియమితులయ్యారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి నియామక పత్రాన్ని బుధవారం ముజఫర్ అలీకి అందజేశారు. నాయకులు సయ్యద్ జావీద్, శివ, అర్షద్ షేక్ తదితరులు పాల్గొన్నారు. – హిమాయత్‌నగర్

నాలాల గుండా..నీరు సాఫీగా పోయేలా

● స్పీడందుకున్న పూడికతీత పనులు
● మే 31లోపు పూర్తిచేసేందుకు చర్యలు

అబిడ్స్, మే 15 : వర్షాకాలంలో వానలు కురిసినప్పుడు నీరు నాలాల గుండా సాఫీగా పోయేందుకు అధికారులు చేపట్టిన పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ కార్యాలయం పరిధిలోని జోనల్ పరిధిలోకి వచ్చే కార్వాన్, నాంపల్లి, గోషామహల్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ సర్కిల్ కార్యాలయాల పరిధిలోకి వచ్చే నాలాల్లో మొత్తం 63 పూడికతీత పనులు 171.256 కి.మీ.లో చేపట్టేందుకు రూ.10.73 కోట్ల నిధులను విడుదల చేసిన విషయం విదితమే. ఆయా నిధులతో నాలాల పూడికతీత పనులను చేపట్టేందుకు గాను అధికారులు టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. వెంటనే నాలాల పూడికతీత పనులను ప్రారంభించారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు జోనల్ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ సహదేవ్ రత్నాకర్ పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. గత నెల వరకు 53.96 కి.మీ. వరకు పనులను పూర్తి చేసిన అధికారులు మే నెలాఖరుకల్లా మిగిలిన పనులను పూర్తి చేసేందుకు గాను పనులను చేపడుతున్నారు.

సకాలంలో పనులు పూర్తి చేస్తాం

జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో నాలాల పూడికతీత పనులు స్పీడందుకున్నాయి. జూన్ రెండో వారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్తగా పనులు చేపట్టారు. మే నెలాఖరులోపు నాలాలోని పూడికతీత పనులు పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు. ఐదు సర్కిల్ కార్యాలయాల పరిధిలో 63 పూడికతీత పనులను చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను త్వరిత గతిన పూర్తి చేస్తాం.

– సహదేవ్ రత్నాకర్, ఎస్ఈ

ఫస్ట్‌ల్యాన్సర్ ప్రాంతంలోని నాలాలో పూడికతీత పనులు కొనసాగుతున్న దృశ్యం

ప్రతిభా పురస్కారాల ప్రదానం

ముషీరాబాద్, మే 15 : రసమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో బాల ప్రతిభావంతులకు పురస్కారాలు ప్రదానం చేశారు. విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, ఛాయాగ్రహణంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలలకు పురస్కారాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాట్య గురువు ఎస్.పి. భారతి, రసమయి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎం.కె.రాము, ములుగు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మల్లేపల్లిలో చోరీ .. నగదు, ఆభరణాల అపహరణ

మెహిదీపట్నం, మే 15: ఓ ఇంట్లో దొంగలు పడి నగదు, ఆభరణాలు అపహరించిన ఘటన హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లేపల్లిలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒవైసీ కమ్యూనిటీ సమీపంలో నివసించే యాసిన్ ఆటోడ్రైవర్. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాడు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి కనిపించాయి. దీంతో బాధితుడు వెంటనే హుమాయూన్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇంట్లో దొంగలు పడి 5 లక్షల 70 వేల నగదు, పదిహేనున్నర తులాల బంగారు ఆభరణాలు పోయాయని ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలను సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.